# ఓబ్బు మనిషి

ఉదయం ఎనిమిది గంటలు. డాక్టర్లొచ్చే టైమయింది. పేషంట్స్ దగ్గరున్న బంధువుల్ని బయట కెళ్ళండని వార్డ్‌బోయ్స్ కేకలేస్తున్నారు. కొందరు ఫినాయిల్ చల్లి వార్డ్సును శుభ్రపరస్తున్నారు. తెల్లని దుస్తుల్లో, ప్రశాంతమైన చూపుల్తో విధులు నిర్వహించే నర్సులు పేషెంట్ల బెడ్స్‌ని సర్దుతున్నారు. కాళ్ల దగ్గర ఉండే బెడ్‌షీట్లని క్రమపద్ధతిలో అమరుస్తున్నారు.

బెడ్ నెంబర్ 15 మీద నీరసంగా కళ్లు మూసుకుని పడుకుని ఉన్నాడు భాస్కరరావు. డాక్టర్లు వార్డుల్లో రౌండు పూర్తిచేసి వెళ్ళేదాకా హాస్పిటల్ సిబ్బంది చేసే పనులు, వాటి క్రమం భాస్కరరావుకు బాగా తెలిసిపోయాయి.

''గుడ్‌మార్నింగ్ సార్!'' ఎదుటి వార్డులో బెడ్‌షీట్ అమరుస్తున్న నర్సును చూస్తున్న భాస్కరరావు పక్కకు చూశాడు.

తన బెడ్ సర్దటానికొచ్చిన ఇద్దరు నర్సుల్లో ఒకామె అతన్ని చూస్తూ చిరునవ్వుతో నుంచుంది.

''గుడ్‌మార్నింగ్!'' రోజూ యాంత్రికంగా పనిచేసుకుంటూ పోయే ఆ అమ్మాయి ఎందుకు పలకరించిందా, అని ఆలోచిస్తున్నాడు భాస్కరరావు.

''ఉదయం మీ కేస్‌షీటు చూశాను. మీరు కరీంనగర్ కాలేజీ లెక్చరర్ కదూ?'' ఆ అమ్మాయి చనువుగా అడిగింది.

''ఔను'' అన్నాడు భాస్కరరావు.

''మాది కరీంనగరే సార్! మా నాన్నగారు సుదర్శన్ టీచర్ మీకు తెలుసనుకుంటాను''

''అయితే నువ్వు సుదర్శన్ అమ్మాయివా?''

''అవును సార్! ఈ హాస్పిటల్లో మూడేళ్లనుండి పనిచేస్తున్నాను. మెడిసిన్‌లో సీటు రాలేదు. కనీసం ఈ విధంగానన్నా రోగులకు సేవ చేయవచ్చునని దీంట్లో చేరాను. నా పేరు స్వరూప సార్!'' భాస్కరరావు బెడ్ సర్దుతూ చెప్పిందా అమ్మాయి.

''ఏమన్నా అవసరముంటే పిలవండి'' అని చెప్పి మరో బెడ్‌వైపు పోయింది స్వరూప.

''ఆ అమ్మాయికి పాతికేళ్లుంటాయేమో! అంత చిన్న వయసులోనే ఇంత బాధ్యత

కలిగిన ఉద్యోగం! పాపం డాక్టరు కావాలనుకుందట. నర్సయింది. అంతే... కలలతో ఎక్కడో అక్కడ కాంప్రొమైజ్ కాక తప్పదు...''

''గుడ్‌మార్నింగ్ భాస్కర్!'' ఆలోచనల్లో మునిగిపోయిన భాస్కరరావు ప్రక్కకు తిరిగి చూశాడు.

డాక్టర్ శ్రీకాంత్ చిరునవ్వుతో నుంచున్నాడు.

''గుడ్‌మార్నింగ్ శ్రీకాంత్'' అన్నాడు భాస్కరరావు.

''హౌ ఆర్ యూ? రాత్రి బాగా నిద్రపట్టిందా?''

''ఫరవాలేదు''

''ఇప్పుడే నీ ఎక్స్‌రే చూశాను. అల్సర్ బాగా ముదిరింది. రెండు మూడురోజుల్లో నీకు ఆపరేషన్ చేయాలి. డోన్ట్‌వర్రీ... యూ విల్ బి ఆల్‌రైట్'' శ్రీకాంత్ ధైర్యం చెప్పాడు.

''వర్రీ అయి చేసేదేముంది? అయామ్ ప్రిపేర్డ్ ఫర్ ది వరస్ట్...'' అన్నాడు భాస్కర్.

డాక్టర్ శ్రీకాంత్ నవ్వాడు.

''వరస్ట్ ఏమీ ఉండదు. ఏదో ఊహించుకుని అలా అవుతున్నావు. ఈ రోజుల్లో అల్సర్ ఆపరేషన్స్ చాలా సాధారణమైపోయాయి'' శ్రీకాంత్.

''థాంక్యూ శ్రీకాంత్. కాని డాక్టర్ సుబ్రహ్మణ్యం గురించి రకరకాలుగా వింటున్నాను. ఇంతకూ అతనితో మాటాడావా?'' భాస్కర్ అడిగాడు.

శ్రీకాంత్ మళ్లీ చిన్నగా నవ్వాడు.

డాక్టర్ సుబ్రహ్మణ్యం ఈజ్ ది బెస్ట్ సర్జన్. ఈ తరహా ఆపరేషన్‌లో అతన్ని మించిన వారు లేరు. అయితే అతడు డబ్బు మనిషి. రోగుల దగ్గర బాగా గుంజుతాడని నేనూ విన్నాను. నీ విషయం నేనతనికి చెబుతాను. నాకు చాలా దగ్గరి ఫ్రెండ్ అని చెప్పి నీ దగ్గర ఏమీ ఆశించకుండా చూస్తాను. ఒకే... మరి నేను వార్డు కెళ్లాలి. మళ్లీ రేపు వస్తాను రిలాక్స్‌గా'' అంటూ శ్రీకాంత్ లేచాడు.

''థాంక్యూ శ్రీకాంత్'' అన్నాడు భాస్కరరావు. శ్రీకాంత్ మెల్లిగా నడుస్తూ వెళ్లిపోయాడు.

డాక్టర్ శ్రీకాంత్‌ది అందమైన రూపం. ఆరడుగుల ఎత్తు... తెల్లగా నిగనిగలాడే శరీరం. నల్లని ఉంగరాల జుట్టు. విశాలమైన నుదురు. చురుకైన కండ్లు. ఎప్పుడూ చిరునవ్వు చిందించే పెదాలు. 45 ఏండ్లున్నా 35 ఏళ్ల వానిలా కనిపిస్తాడు శ్రీకాంత్.

శ్రీకాంత్ కనుమరుగయ్యే దాకా అతన్నే చూస్తూ ఉండి, ఆ తర్వాత గట్టిగా కళ్ళు మూసుకున్నాడు భాస్కర్.

హైస్కూలు వరకూ భాస్కర్, శ్రీకాంత్ కలిసి చదువుకున్నారు. బిఎస్‌సి మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు శ్రీకాంత్‌కు మెడిసిన్‌లో సీట్ వచ్చింది. తను ఎంఎస్‌సి

పూర్తిచేసి లెక్చరర్‌గా స్థిరపడ్డాడు.

భాస్కర్‌రావుది కూడా శ్రీకాంత్ వయస్సే. శ్రీకాంత్ అంత ఆకర్షణీయమైన రూపం కాకపోయినా, చూడగానే గౌరవం కలిగించే రూపం భాస్కర్‌ది.

''ఎంత భయపడవద్దనుకున్నా ఆపరేషనంటే భయంగానే వుంటుంది. అందులోనూ కడుపును కోసి, పేగుకంటుకొనివున్న అల్సర్‌ను తీసేయాలంటే...'' భాస్కర్ మనసు ఆలోచనల్లో పడిపోయింది.

''ఈ శరీరం ఒక యంత్రం... యంత్రంలో ఏదన్నా చెడిపోతే దాన్ని మెకానిక్ దగ్గరకు తీసుకుపోతాం. వాడు ఆ యంత్రాన్ని మొత్తం విప్పి, చెడిపోయిన భాగాన్ని బాగుచేసి, అవసరమైతే స్పేర్‌పార్ట్‌వేసి మళ్లీ ఫిట్‌చేసి నడిపిస్తాడు. అలాగే మానవ యంత్రాన్ని విడదీసి, చెడిపోయిన భాగాల్ని బాగుచేసి మళ్ళీ ఫిట్‌చేస్తాడు డాక్టర్.

తనకు చెడు అలవాట్లంటూ ఏమీ లేవు. అయినా తనకీ అల్సర్ ఎందుకు పుట్టిందో అర్థం కాదు. భాస్కరరావు పైన తిరిగే ఫ్యానును చూస్తూ ఆలోచనల్లో తిరుగుతున్నాడు.

''భాస్కరరావంటే నువ్వేనా?'' కఠినంగా వినిపించిన వేపు తిరిగి చూశాడు భాస్కరరావు. ఏమాత్రం శ్రద్ధలేని చూపులతో నుంచున్నాడు డాక్టర్ సుబ్రహ్మణ్యం.

''ఔనండీ...''

''నీ కేస్ షీటేది?'' ఎటో చూస్తూ అడిగాడు.

''ఇంతకుముందే నర్స్ తీసికెళ్లింది''

''సరే... నేనక్కడ చూస్తాలే... అవునూ... నీకు డాక్టర్ శ్రీకాంత్ బంధువా?''

''కాదు స్నేహితుడు''

''ఎలా...?''

''చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం''

''అల్లాగా... ఇప్పుడేం చేస్తున్నావు?''

''లెక్చరర్‌గా పనిచేస్తున్నాను''

''ఐసీ... ఆపరేషన్ ఎప్పుడు చేసుకుంటావు?''

''మీరెప్పుడు చేస్తే అప్పుడే...''

''ఓహో...'' ఒక్కసారి సూటిగా భాస్కరరావు కళ్లల్లోకి చూసి, గబుక్కున వెనక్కి తిరిగి, చకచకా వెళ్లిపోయాడు డాక్టర్ సుబ్రహ్మణ్యం.

వెళ్లిపోతున్న సుబ్రహ్మణ్యాన్ని చూస్తూ అలాగే ఉండిపోయాడు భాస్కరరావు.

డాక్టర్ సుబ్రహ్మణ్యం పొట్టిగా ఉంటాడు. నల్లగా ఉంటాడు. పెద్ద పొట్ట... బట్టతల. ముఖంమీద మొటిమల మచ్చలు. ఉబ్బిన చెంపలు. ఎప్పుడూ తాగేవాని కళ్ళలాంటి ఎర్రని

కళ్ళు, లోతుకుపోయి సన్నని ద్వారం గుండా కాలిబాటకు వచ్చే ఇనుపచువ్వల్లాంటి చూపులు. ఎదుటివాన్ని అదరగొట్టే కంఠధ్వని. అంత పెద్ద పేరున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం... ఒక్క మాటలో అసలు డాక్టర్‌లా ఉండడు. సంస్కారం సంగతలా ఉంచి, అతని మాటల్లో చేతల్లో వికారం వుండి అతని రూపానికి మరింత విరూపత్వాన్ని కలిగిస్తుంది.

ఈసారి భాస్కరరావు ఆశ్చర్యమూ ఆలోచనల్లో మునిగిపోయాడు. నర్స్ స్వరూప వచ్చేదాకా అతను అట్లే ఉండి పోయాడు.

''మీకో విషయం చెప్పాలి సార్! డాక్టర్ సుబ్రహ్మణ్యం చాలా సమర్థుడైన డాక్టరే... ది బెస్ట్ సర్జన్ ఇన్ ది హాస్పిటల్... కాని అతడు డబ్బు మనిషి సార్... మీరు అతనికి వెయ్యి రూపాయలన్నా ముట్టచెప్పకపోతే మిమ్మల్నసలు టచ్ చెయ్యడు. డబ్బు ముట్టేదాకా ఆపరేషన్ జరగదు.''

స్వరూప గుసగుసగా అంది.

''నేనూ విన్నాను... కాని డాక్టర్ శ్రీకాంత్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్... సుబ్రహ్మణ్యంతో మాట్లాడి అతడే నన్నీ వార్డులో అడ్మిట్ చేయించాడు. డబ్బు విషయం కూడా అతడే మాట్లాడతానన్నాడు...'' భాస్కరరావు.

''లాభం లేదు సార్! సుబ్రహ్మణ్యం ఎంత కర్కోటకుడంటే – స్వంత చెల్లెలు దగ్గర కూడా డబ్బు తీసుకుంటాడు. నాదే ఒక పర్సనల్ ఎక్స్‌పీరియన్స్... మా తమ్ముడికి ఓసారి అపెండిసైటిస్ ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. 24 గంటల్లో ఆ ఆపరేషన్ చేయాలి. నా దురదృష్టం... ఆ రోజు ఈ సుబ్రహ్మణ్యం ఒక్కడే ఉన్నాడు, మిగతా స్పెషలిస్టలు లేరు. నేనిక్కడ పనిచేస్తూ వేరే నర్సింగ్‌హోంకు తీసికెళ్ళడానికి మనస్కొప్పలేదు. సరే... తెలిసినవాడు ఆ మాత్రం కన్సిడర్ చేయడా అనుకొని ఇంటికి వెళ్లి రిక్వెస్ట్ చేశాను... అతడేమనుకున్నాడో తెలుసా?'' స్వరూప కాసేపాగింది.

''ఏమన్నాడు?'' భాస్కర్ అడిగాడు.

''మీ తమ్ముడు కాబట్టి ఓ 500/– ఇచ్చుకో. వేరే వాళ్లకయితే 1000/– తీసుకుంటాను'' అన్నాడు.

''ఛ ఛ! అసహ్యంగా ఉంది వినడానికి'' భాస్కర్.

''అంతేనా సార్ – ఇంకా చూడండి. తీరా ఆపరేషన్ థియేటర్‌కి వచ్చి, టెస్ట్‌చేసి – 'ఆలస్యమైపోయింది. అపెండిసైటిస్ బర్స్ట్ అయి కడుపంతా పాయిజనయింది. ఇది పెద్ద ఆపరేషన్ – మరో మూడు వందలిస్తే తప్ప ఆపరేషన్ చేయను. ఆలస్యమైతే ప్రాణం పోతుంది' అన్నాడు. ఏం చేయను? మా హెడ్‌నర్స్ నడిగి అప్పటికప్పుడు 300/– ఇస్తే తప్ప ఆపరేషన్ చేయలేదు'' అంది స్వరూప.

''ఇన్‌హ్యూమన్. ఇన్‌హ్యూమన్'' భాస్కర్.

''ఇన్నాళ్ళుగా హాస్పిటల్‌లో పన్జేస్తున్నాను. అతని వార్డులోనే పన్జేస్తున్నాను. అలాంటి నా

దగ్గర 800/- పట్టించాడు. యిక శ్రీకాంత్‌గారి మాటలు ఆయనకు లెక్కా?'' స్వరూప అనుమానాన్ని వెలిబుచ్చింది.

''మీరు సూపరింటెండెంట్‌కు చెప్పాల్సింది'' భాస్కర్.

''అయ్యో రామ! మా నర్సెస్ అసోసియేషన్ చాలా స్ట్రాంగ్‌గా కండెమ్ చేశాం. సూపరింటెండెంట్ సాక్ష్యాలడిగాడు. అయితే సుబ్రహ్మణ్యానికి చీమ కుట్టినట్టు కూడా కాలేదు. అంతేకాదు అప్పటినుండి నర్సులంటే ఆయనకు విపరీతమైన కోపం పెరిగిపోయింది. ఎందుకయినా మంచిది. వాడి మొహాన ఎంతో కొంత పడేసి ఆపరేషన్ చేయించుకోండి సార్!''

స్వరూప సలహా ఇచ్చింది.

''ఇదంతా వింటుంటే నాకు భయంగా ఉందండి. సాయంత్రం మా తమ్ముడు శ్రీనుతో 500/- పంపించండి'' భయంగా కండ్లనిండా నీళ్లతో అంది భాస్కర్‌రావు భార్య అనూరాధ.

''తొందరపడకు అనూ! మనం శ్రీకాంత్‌కు తెలియకుండా ఏం చేయవద్దు. అతడే నన్నీ వార్డులో అడ్మిట్ చేయించాడు. మనం ఇప్పుడు వెళ్ళి డబ్బిస్తే ఆయన హర్ట్ అవుతాడు'' భాస్కర్ సముదాయించాడు.

''డాక్టర్ శ్రీకాంత్ దేవుడిలాంటివాడు సార్! ఆయన బెస్ట్ కార్డియాలజిస్టు... సుబ్రహ్మణ్యంలా వుంటే ఈపాటికాయన కోట్లు సంపాదించేవాడు. కన్సల్‌టేషన్ ఫీస్ తప్ప ఏమీ తీసుకోడాయన డాక్టర్లందరూ అతనిలాంటివారయితే ఈ ప్రపంచం స్వర్గమే అయిపోయేది'' స్వరూప కళ్లల్లో శ్రీకాంత్‌పట్ల గౌరవభావం.

''చూద్దాం... రేపు శ్రీకాంత్ వస్తాడుగదా'' భాస్కర్.

''మీ ఇష్టం సార్'' అంటూ స్వరూప వెళ్లిపోయింది.

మధ్యాహ్నం పన్నెండుగంటల దాకా భాస్కర్ ఏదో ఆలోచిస్తూనే ఉన్నాడు. స్ట్రెచర్‌పై భోజనాలు రావడం, రోగుల భోజనాలు, ఆతర్వాత వంతనాలు - అన్నీ వింటూ వుండిపోయాడు.

''ఈ వాతావరణంలో ఎంతకాలముండాలి?'' అన్న ఆలోచన భాస్కర్‌రావును తీవ్రంగా క్రుంగదీస్తోంది.

* * *

సాయంకాలం నాలుగ్గంటలయింది. పేషెంట్స్‌ను చూడటానికి విజిటర్స్ వస్తున్నారు.

''నన్ను గుర్తుపట్టారా సార్!'' బెడ్ ప్రక్కగా వచ్చి నుంచున్నాడో యువకుడు. సన్నగా పొడుగ్గా వుండి మెడలో స్టెత్ వేసుకుని చూడముచ్చటగా వున్నాడు.

''ఎక్కడో చూసినట్టుగా వుంది'' అన్నాడు భాస్కరరావు - అతన్ని గుర్తుతెచ్చుకోవడానికి

ప్రయత్నిస్తూ.

''నేను మీ స్టూడెంట్‌ని సార్. మీ దగ్గర బి.ఎస్సి ఫస్టియర్ చదివాను. ఆ తర్వాత మెడిసిన్‌లో సీటొచ్చింది...''

''ఔను... ఇప్పుడు గుర్తొచ్చింది. నీ పేరు సుధాకర్ కదూ?'' భాస్కర్‌రావు.

''ఔనుసార్! యిప్పుడు హౌజ్ సర్జన్ చేస్తున్నాను. ఇంతకుముందే బయట మీ కొలీగ్ కనిపించి చెప్పాడు. వెంటనే ఇక్కడకు వచ్చాను'' సుధాకర్.

''అలాగా?'' అన్నాడు భాస్కర్‌రావు.

సుధాకర్ బెడ్‌కింది కేస్‌షీటు తీసుకుని కాసేపు పరిశీలించాడు. స్టూలు లాక్కొని కూర్చున్నాడు.

''అల్సర్ బాగా ముదిరింది సార్. వెంటనే ఆపరేషన్ చేయాలి. కానీ...'' సుధాకర్ నసిగాడు.

''చెప్పు సుధాకర్! సందేహించకు''

''డాక్టర్ సుబ్రహ్మణ్యం ఈజ్ ది బెస్ట్ సర్జన్ సార్! ఆని, వరస్టు హ్యూమన్ బీయింగ్... డబ్బు ముట్టకుంటే డెత్‌బెడ్‌మీద ఉన్న పేషెంటును కూడా చూడడు''

''అవునట. కాని డాక్టర్ శ్రీకాంత్ నా కాప్తమిత్రుడు. అతడే సుబ్రహ్మణ్యంతో మాట్లాడాడు''

''లాభం లేదు సార్... మీకో ఎగ్జాంపుల్ చెపుతాను - దాన్నిబట్టి డబ్బు విషయంలో సుబ్రహ్మణ్యం ఎలాంటివాడో మీకు తెలుస్తుంది. రామనాథమని ఓ పెద్ద లాయర్... సుబ్రహ్మణ్యం ఇంటిపక్కనే ఉండేవాడు. వాళ్ల ఫ్యామిలీ, వీళ్ల ఫ్యామిలీ చాలా దగ్గరయ్యారు. రెండు కుటుంబాలవారూ చాలా ఆత్మీయుల్లా వుండేవారు ఒకసారి రామనాథం పెద్దకొడుక్కు మీలాగే... అల్సర్ ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. సుబ్రహ్మణ్యం ఉన్నాడు కదా అని ధీమాగా రామనాథం కొడుకును హాస్పిటల్లో అతని వార్డులోనే చేర్పించాడు. రోజులు గడిచిపోతున్నాయి. కాని - ఆపరేషన్ జరగడం లేదు. లాయర్ ఎప్పుడడిగినా - రేపు రేపంటూ వుండేవాడు. ఇక్కడ పేషంటు పరిస్థితి రోజురోజుకీ దిగజారిపోతోంది. వాళ్లు వీళ్లు రామనాథానికి అసలు విషయం చెప్పారు. లాయరు మొదట నమ్మలేదు. కాని నమ్మక తప్పలేదు'' సుధాకర్ చెప్పుకుపోతున్నాడు.

''చివరకు ఓనాడు రామనాథం వేయి రూపాయలు తీసుకుని సుబ్రహ్మణ్యాన్ని కలిశాడు. ఆ డబ్బు తీసుకుంటూ సుబ్రహ్మణ్యం ''ప్రొఫెషన్ వేరు, ఫ్రెండ్‌షిప్ వేరు. లాయర్‌గా మీరు బోలెడు సంపాదిస్తున్నారు. డాక్టరుగా నేనూ సంపాదించాలి కదా! మీకిచ్చే కెపాసిటీ ఉన్నప్పుడు నేనెందుకు తీసుకోవద్దు? అందుకే ఈ వెయ్యీ తీసుకుంటున్నాను. రేపు మీ అబ్బాయికి ఆపరేషన్ చేస్తాను'' అన్నాడు. మరునాడే సక్సెస్‌ఫుల్‌గా ఆపరేషన్ చేశాడు... సో... దటీజ్ డాక్టర్ సుబ్రహ్మణ్యం... వాడు కర్కోటకుడు సార్... మా హౌజ్

సర్జన్లందరికీ ఈ సంగతి తెలుసు. మా కెరీర్‌ను దృష్టిలో ఉంచుకుని మాట్లాడకుండా ఉంటాము'' సుధాకర్ ముగించాడు. తర్వాత కాసేపు అదీ ఇదీ మాట్లాడి వెళ్లిపోయాడు.

ఆ తర్వాత భాస్కరరావును చూడడానికి వచ్చిన మిత్రులు, బంధువులు – అందరూ ఇదే మాట – సుబ్రహ్మణ్యానికి డబ్బిస్తే తప్ప అస్సలు చూడడని...

ఆ రాత్రంతా భాస్కరరావుకు ఆలోచనలతో నిద్రపట్టలేదు. ''దేశంలో ఇలాంటి పరిస్థితి ఎందుకేర్పడింది? లంచం ఇవ్వడమూ, తీసుకోవడమూ నేరమే అని తెలిసినవాళ్లే స్వయంగా లంచాలిస్తున్నారు, తీసుకుంటున్నారు. అసలు ఈ డాక్టర్స్‌కి డబ్బు ఎందుకివ్వాలి? తనలాంటివాళ్లను చూడడానికే కదా నెలకి వేలకు వేలు జీతాలిచ్చి డాక్టర్లుగా నియమించింది? ఎవరికి చెప్పాలీ విషయాన్ని? ఎవరాపుతారు? కంచే చేను మేస్తున్న ఈ పరిస్థితుల్లో – ఈ ఓపెన్ సీక్రెట్ విషయం ప్రత్యేకంగా చెప్పాలా? తనేం చేయాలిప్పుడు. ఈ సుబ్రహ్మణ్యం సాలెగూటిలో చిక్కుకుపోయాడేం తను? శ్రీకాంత్ డబ్బివ్వద్దంటాడు. వాడు డబ్బు ముట్టందే తనను ముట్టడు. ఎట్లా?'' భాస్కరరావు మనసంతా చికాకయిపోయింది. ఈ ఆలోచనలతోనే తెల్లవార్చాడు భాస్కరరావు.

మరునాడు వచ్చిన శ్రీకాంత్‌ని చూచి, ఈ సంగతి ఇవ్వాళ తేల్చుకోవాలనుకున్నాడు భాస్కరరావు కాని...

''నిన్న నీ గురించి సుబ్రహ్మణ్యానికి గట్టిగా చెప్పాను. ఐదేళ్లుగా కలిసి పనిచేస్తున్నాము. అతడెన్నో కేసులు నాకు రెకమెండ్ చేశాడు. నా కేసిదికొటే. తప్పకుండా ఒకటి రెండు రోజుల్లో ఆపరేషన్ చేస్తాడు. డబ్బు విషయం అనవసరంగా ఆలోచించకు. ఈ రోజు నీ దగ్గరకొస్తాడు. డేట్ ఫిక్స్ చేస్తాడు. మరి నాకు అర్జంటుగా చూడాల్సిన కేసొకటుంది వస్తాను. రేపుదయం వస్తాను'' అని గబగబా చెప్పేసి వెళ్లిపోయాడు.

భాస్కరరావు మనసు కుదుటపడింది.

తొమ్మిది గంటలకు డాక్టర్ సుబ్రహ్మణ్యం వచ్చాడు. శ్రీకాంత్ చెప్పింది నిజమే – అనుకున్నాడు భాస్కర్.

''ఆ – మీరు లెక్చరర్ కదూ? ఏ సబ్జెక్టులో'' కేస్‌షీటును తిరగేస్తూ అడిగాడు డాక్టర్.

''జువాలజీలో''

''ట్యూషన్లవీ చెపుతున్నారు గదా! ప్రాక్టికల్స్‌లో మార్కులు వేస్తున్నారు కదా! అదీకాక... మీకు యూజీసీ స్కేలు కదూ!... నీ సర్వీసెంత?''

''పదిహేనేళ్లు...''

''అంటే నీ జీతమే రెండువేలు దాటి వుంటుంది అవునా?''

''1800/– వరకుంటుంది''

''ఫరవాలేదులే – అదీ జీతమే కదా – అయినా ఈ దేశంలో ఇది పెద్ద జీతం కిందే

లెక్క'' అంటూ కేస్‌షీటుమీద ఏమోరాసి కదలబోయాడు.

* * *

''డాక్టర్! నాకు ఆపరేషనెప్పుడు చేస్తారు?'' అడిగాడు భాస్కరరావు.

''నేను చేయడం కాదు... నువ్వెప్పుడు చేయించుకుంటావన్నది ప్రశ్న'' అంటూ గబగబా వెళ్ళిపోయాడు డాక్టర్.

భాస్కర్‌రావు అయోమయంగా చూస్తున్నాడు.

''వాడికి డబ్బివ్వంది ఆపరేషన్ చేయడండి. చూశారా ఏవిధంగా మాట్లాడాడో!'' అనూరాధ అంది.

''అలాగే అనిపిస్తోంది అనూరాధా! చూద్దాం... రేపు శ్రీకాంత్‌కి ఈ విషయం చెబుదాం'' అన్నాడు భాస్కర్.

ఆ సాయంత్రం భాస్కరరావు స్టూడెంట్స్ వచ్చారు చూడటానికి. అందులో ఓ విద్యార్థి ఆసక్తికరమైన విషయాన్ని చెప్పాడు.

ఒకసారి అండర్‌గ్రౌండుకు పోయిన లెఫ్టిస్టుల్లో ఒకర్ని సుబ్రహ్మణ్యం వార్డులో చేర్చారట. వారం పదిరోజులు గడిచాక, రోగి వెంట వున్న వాడు పోయి అడిగితే డబ్బడిగాడట. అంతే - ఆ రాత్రే వాళ్ల పార్టీవాళ్లు ఇంటికిపోయి, మూడురోజుల గడువిచ్చి అల్టిమేటమ్ ఇచ్చారట. ఆ మర్నాడే రోగికి ఆపరేషన్ జరిపించడం, సకల మర్యాదలు చేయించడం, ఉదయమూ సాయంత్రమూ వచ్చి చూడడమూ చేశాడట. అతన్ని డిశ్చార్జి చేసేదాకా తన స్వంత కొడుకువలె చూసుకున్నాడట.

ఈ సంగతి చెప్పి - ''వాడిని ఆవిధంగా లొంగదీయాలి సార్'' అన్నాడో విద్యార్థి. భాస్కర్‌రావు ఈ విషయం విని నవ్వాడు. ''ఇలాంటివారే కావచ్చు. అలాంటివాళ్లను సృష్టించింది. వాళ్లకేతేనే లొంగుతారు కావచ్చు వీళ్లు'' అనుకున్నాడు.

మర్నాడు వచ్చిన డాక్టర్ శ్రీకాంత్‌కి సుబ్రహ్మణ్యం మాటల్ని చెప్పాడు భాస్కర్‌రావు. ''అతడెప్పుడు ఆపరేషన్ చేస్తాడన్నది కాదు - తాను ఎప్పుడు ఆపరేషన్ చేయించుకుంటాడు అనేదే ప్రశ్న'' గా మారిన సంగతి చెప్పాడు.

శ్రీకాంత్ ముఖం వెలవెలబోయింది. క్రమంగా కఠినంగా మారి ఆ తర్వాత కాసేపటికి శాంతంగా మారింది.

''సారీ భాస్కర్! నేనింత చెప్పినా వాడి ధోరణి మారలేదు. హీ ఈజ్ ఎన్ ఇన్‌కారిజబుల్ క్రూక్ - సరే! ఈరోజే వాడికో ఐదొందలు ఇంటికి పంపించండి. ఎనీ ప్రాబ్లమ్ రికార్డింగ్ మనీ?'' అడిగాడు శ్రీకాంత్.

''నేనే... ఐ విల్ అరేంజిట్'' భాస్కర్.

''టేకిటీజీ... యూనీడ్ యిమ్మీడియెట్ ఆపరేషన్. ఇంకా ఆలస్యం కావద్దు. సో... సీ యు టుమారో'' శ్రీకాంత్ లేచి నెమ్మదిగా నడచిపోయాడు. అతని నడకలో ఎప్పటిలా

హుందాతనం లేదు.

* * *

ఆ సాయంత్రం భాస్కరరావు బావమరిది పోయి సుబ్రహ్మణ్యానికి డబ్బివ్వడానికి వెళ్లాడు. తనను పరిచయం చేసుకున్నాడు.

''ఆ... అవసరం యిప్పటికి తెలిసొచ్చిందన్నమాట. డబ్బు ఇవ్వగలిగే వాళ్లివ్వాలి. తీసుకోగల్గేవాళ్ళు తీసుకోవాలి. దటీజ్ ది లా ఆఫ్ దిస్ వరల్డ్. మీ బావగారు లెక్చరర్. జీతంకాక ట్యూషన్లు, ప్రాక్టికల్సూ... సంపాదిస్తున్నాడు. తనకోసం ఓ ఐదొందలిచ్చుకోలేడూ? ఇంత మాత్రానికి రికమెండేషన్లెందుకూ? అందరూ యిట్లా రెకమెండేషన్లు తెస్తే మరి మా పొజిషనెలా కాపాడుకోవాలి?'' నవ్వుతూ మాట్లాడుతూ... మాట్లాడుతూ నవ్వాడు డాక్టర్.

భాస్కర్ బావమరిది ఐదొందలు తీసి చేతికివ్వబోయాడు.

''అమ్మమ్మమ్మ... డబ్బునిలా నేకెడ్‌గా చేతికిస్తారా? డబ్బు చాలా పవిత్రమైనది. ఇదిగో ఆ టీపాయ్‌మీద భగవద్గీత ఉంది. డబ్బును దాన్లో ఉంచు'' అన్నాడు.

అతడు భగవద్గీత తెరిచి డబ్బు అందులో పెట్టాడు.

''నౌ... మీరు నిశ్చింతగా ఉండండి. మీ బావగారిని హాయిగా నిద్రపొమ్మనండి. ఎల్లుండి ఆపరేషన్ చేస్తాను. ఇక అతని అల్సర్ పోయిందనుకోండి'' అన్నాడు.

మర్నాడు భాస్కరరావును ఎగ్జామిన్ చేసి, ఆపరేషన్‌కు తయారుచేయించి, ఆ మర్నాడే ఆపరేషన్ చేశాడు డాక్టర్ సుబ్రహ్మణ్యం.

* * *

రెండు నెలల తర్వాత రాత్రి పదిగంటలకు డాక్టర్ శ్రీకాంత్ ఫోన్ మోగింది. ఏదో మెడికల్ మాగజైన్ చదువుకుంటున్న శ్రీకాంత్ ఫోనెత్తాడు.

''హలో డాక్టర్! నేను మిసెస్ డాక్టర్ సుబ్రహ్మణ్యాన్ని... మావారికి సడెన్‌గా గుండెపోటు వచ్చింది మీరు వెంటనే రావాలి...'' చాలా ఆత్రంగా వినిపించింది ఆమె గొంతు.

అరనిమిషం దాకా ఏమీ మాట్లాడలేదు శ్రీకాంత్.

''హలో డాక్టర్! మీకెంత ఫీసయితే అంత తీసుకోండి. కాని మీరు వెంటనే రావాలి... ప్లీజ్ కారు పంపించమంటారా?''

''అక్కర్లేదు... నాకిప్పుడు తీరిక లేదు. ఈ ఊర్లో చాలామంది డాక్టర్లున్నారు... మరెవరినన్నా పిలిపించుకోండి'' శ్రీకాంత్ గొంతు కఠినంగా మారింది.

''నో... నో... డాక్టర్... మీరే రావాలి... కాదనకండి... వేయి, రెండువేలు... మీకు కావలసినంత ఫీసు తీసుకోండి. డాక్టర్... ప్లీజ్...'' ఆమె గొంతు దుఃఖంతో జీరవోయింది.

''అయామ్ సారీ...'' ఫోన్ పెట్టేశాడు శ్రీకాంత్.

పది నిమిషాల తర్వాత మళ్లీ ఫోన్ మోగింది. శ్రీకాంత్ అసహనంగా ఫోనెత్తాడు.

''హలో... డాక్టర్ రఘు స్పీకింగ్... ఇప్పుడే డాక్టర్ సుబ్రహ్మణ్యాన్ని హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. ఇంటెన్సివ్ కేర్‌లో పెట్టాము... మీరోసారి రావాలి ప్లీజ్...'' సుబ్రహ్మణ్యం అసిస్టెంటు మాట్లాడుతున్నాడు.

''నే... నాకిప్పుడు రావడానికి వీలుపడదు. శివరాం, సాంబశివ్... ఇంకా చాలామంది డాక్టర్లున్నారు వాళ్లను పిలిపించుకోండి'' ఫోన్ పెట్టేశాడు శ్రీకాంత్.

అరగంట గడిచిపోయింది. శ్రీకాంత్ మనసంతా చికాకుగా ఉంది. తన ప్రొఫెషన్ గుర్తొచ్చింది. సుబ్రహ్మణ్యం దుష్టత్వం గుర్తొచ్చింది. ఏమైనాసరే ఆ దుర్మార్గుడ్ని చూడకూడదు అనుకున్నాడు.

మరోసారి ఫోన్ మోగింది. ఈసారి అతను ఫోను ఎత్తలేదు.

మరో అరగంటకు డాక్టర్ రఘు స్వయంగా శ్రీకాంత్ ఇంటికి వచ్చాడు.

''డాక్టర్! మన ప్రొఫెషన్, మన కర్తవ్యం, డిగ్రీ తీసుకుంటున్నప్పుడు మనం చేసిన వాగ్దానం గుర్తుకు తెచ్చుకోండి ప్లీజ్... మీరు వెంటనే హాస్పిటల్‌కు రావాలి. మీరు రాకుంటే అతడు బ్రతకడు'' రఘు కూర్చోకుండానే శ్రీకాంత్‌ను ప్రార్థించాడు.

''వై... ఊర్లో ఇంకా చాలామంది డాక్టర్లున్నారు. వారిని పిలిపించుకోండి'' శ్రీకంత్.

''డాక్టర్... మీకు తెలియంది లేదు. సుబ్రహ్మణ్యాన్ని చూడటానికి ఎవరూ రావడం లేదు. డాక్టర్స్ నర్సెస్, వార్డ్ బోయ్స్, చివరకు స్వీపర్స్ కూడా దగ్గరకు రావడం లేదు. హాస్పిటల్లో మరో స్ట్రోక్ వచ్చింది. ఎలాగో నేను కాపాడగలిగాను. అతగాడు కూడా మిమ్మల్ని కలవరిస్తున్నాడు. మళ్ళీ స్ట్రోక్ వస్తే నేను బ్రతికించలేను. ప్లీజ్... డాక్టర్... కాదనకండి... మీరైతేనే నా ప్రార్థనను వినిపించుకుంటారని, మీ సహృదయత్వంమీద ఆశతో వచ్చాను. మరెవరూ విధిని గురించి ఆలోచించరు. ప్లీజ్ రండి రండి డాక్టర్'' డాక్టర్ రఘు దయనీయంగా ప్రార్థించడం శ్రీకాంత్‌ను కదిలించింది. కాసేపాలోచించి డాక్టర్ శ్రీకాంత్ రఘుతో బయలుదేరాడు.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఒక బెడ్‌మీద డాక్టర్ సుబ్రహ్మణ్యం పడుకున్నాడు. చూపులు దీనంగా ఉన్నాయి. అతని భార్య తప్ప మరెవరూ అక్కడలేరు. దూరంగా నర్సెస్ ఒకచోట కూర్చున్నారు. ఆ పరిస్థితి చూసి శ్రీకాంత్‌కు జాలి కలిగింది.

శ్రీకాంత్‌ను చూడగానే సుబ్రహ్మణ్యం ముఖం వెలిగిపోయింది. ఏదో మాట్లాడ బోయాడు. శ్రీకాంత్ వారించాడు.

శ్రీకాంత్ అతన్ని టెస్ట్ చేశాడు. ఇంజెక్షన్స్ చేశాడు. వేయాల్సిన మందులు రఘుకు చెప్పాడు.

''డాక్టర్ సుబ్రహ్మణ్యం... యూ విల్ బి ఆల్‌రైట్. ఎక్సైట్ కాకండి. రేపు మళ్ళీ వచ్చి టెస్ట్ చేస్తాను'' శ్రీకాంత్.

''డాక్టర్... నన్ను బ్రతికించండి డాక్టర్... నేను దుర్మార్గుణ్ని... రాక్షసుణ్ని... నన్ను అందరూ... చివరకు వార్డ్‌బోయిస్ కూడా బాయ్‌కాట్ చేశారు. డబ్బు వ్యామోహంలో పడి నేనే అందర్నీ దూరం చేసుకున్నాను. నేను మారిపోతాను డాక్టర్... నన్ను బ్రతికించండి. పునర్జన్మ ప్రసాదించండి'' సుబ్రహ్మణ్యం కళ్లనుండి ధారాపాతంగా కన్నీరు ప్రవహిస్తోంది.

''డాక్టర్... ఆవేశపడకండి. అంతా సర్దుకుంటుంది. ఇక మీకు హార్ట్ ఎటాక్ రాదు. మీరు బ్రతుకుతారు. ఐయామ్ హియర్. సరేనా!'' శ్రీకాంత్ సుబ్రహ్మణ్యం చేతులు తన చేతుల్లోకి తీసుకుని నెమ్మదిగా అదిమాడు.

ఆ తర్వాత డాక్టర్ శ్రీకాంత్ నర్సెస్, హౌజ్‌సర్జన్స్, వార్డ్‌బోయ్స్‌ని ఒకచోటికి పిలిపించాడు.

''చూడండి... డాక్టర్ సుబ్రహ్మణ్యం దుర్మార్గుడు కావచ్చు. కాని ఇప్పుడతడు పేషంట్. అతనిపట్ల మనం ఇంత ఇదిగా ఉండకూడదు'' శ్రీకాంత్.

''వాడి పాపాలకు ఫలితాన్ననుభవించనీయండి సార్. సంపాదించిన డబ్బంతా మీద కప్పుకుని బ్రతకమనండి'' ఒక వార్డుబోయ్ కోపంగా అన్నాడు.

అక్కడకు చేరవచ్చిన డ్యూటీ డాక్టర్, మరో డాక్టర్ కూడా ఆ విధంగానే అన్నారు.

''అలా అనకండి... మన ప్రొఫెషనల్ రెస్పాన్సిబిలిటీని గుర్తుతెచ్చుకోండి'' శ్రీకాంత్.

''ఆ రెస్పాన్సిబిలిటీ వాడికి లేదా? హి ఈజ్ నాట్ ఎ మ్యాన్... మాన్‌స్టర్... హి మస్ట్ బి పనిష్డ్ లైక్ దిస్...'' డ్యూటీ డాక్టరన్నాడు.

''ప్లీజ్ గట్టిగా మాట్లాడకండి... ఈ ఒక్కసారి అతనికి బ్రతికే అవకాశం కల్పించండి. అతడు తప్పకుండా మారుతాడు'' శ్రీకాంత్ ప్రార్థనాపూర్వకంగా అన్నాడు.

ఎవరూ మాట్లాడలేదు. కాసేపలాగే వుండి శ్రీకాంత్ తానే అన్నాడు మళ్లీ.

''నౌ హి ఈజ్ ఆల్‌రైట్... మళ్లీ ఏదన్నా ట్రబులిస్తే వెంటనే నాకు ఫోన్ చేయండి. డాక్టర్ రఘు! మీరు చూస్తూ ఉండండి'' అంటూ శ్రీకాంత్ ఇంటికి వెళ్లిపోయాడు.

మర్నాడు హాస్పిటల్‌కు వచ్చి సుబ్రహ్మణ్యాన్ని చూడబోయాడు డాక్టర్ శ్రీకాంత్. సుబ్రహ్మణ్యం ముఖం నిండా ముసుగు కప్పి వుంది. ఒకవేపు అతని భార్య! మరోవేపు డాక్టర్ రఘు విచారంగా కూర్చొని ఉన్నారు. మిగతావాళ్లు ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నారు.

శ్రీకాంత్ రఘు దగ్గరకు పోయి ఏమయిందని అడిగాడు. జీవంలేని సుబ్రహ్మణ్యం చేయి పట్టుకుని చూశాడు. ఆ చావు హార్ట్‌ఎటాక్‌వల్ల వచ్చింది కాదు.

''మీరంతగా చెప్పినా రాత్రంతా ఒక్క పురుగు కూడా అతని వద్దకు రాలేదు డాక్టర్. ఆ

షాకుతోనే అతని ప్రాణం పోయింది.'' రఘు చెప్పాడు.

''పాపం... డబ్బు మనిషిగా ఉన్నంతకాలం బ్రతికాడు. మారదామనుకున్నాడు కాని మారడానికి బతుకే లేకుండా పోయింది. పూర్ ఫెలో. ఐ మస్ట్ పిటీ హిం'' అంటూ శ్రీకాంత్ విచారంగా తన వార్డుకేసి నడుచుకుంటూ వెళ్లిపోయాడు. ★

(స్వాతి మాసపత్రిక, డిసెంబర్ 1982)